తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
9 జూలై 2026
పేజీలు : 08

# గ్రామాల్లో సుపరిపాలనకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

- ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష
- మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి
- ప్రజల అవసరాలు గుర్తించి సేవ చేయాలి



**కొడంగల్, జూలై 08 (జనంసాక్షి):**
గ్రామాల్లో సుపరిపాలన అందించాలంటే అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తెలిపారు. కడ కార్యాలయంలో బుధవారం జిల్లా అధికారులు, కొడంగల్ నియోజకవర్గం తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు దీపక్ తివారి, ప్రియాంకలతో కలిసి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మంచి పాలన అందించడం ద్వారా ప్రజలకు నిజమైన సేవ చేసిన వారమవుతామన్నారు. గ్రామాల్లో అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యటించి పరిశీలించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.
పట్టణ, గ్రామ స్థాయిలో అంతర్గత మురుగు కాలువలు, వీధి దీపాలు, తాగునీరు సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు మంజూరు చేసి విద్యకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు.
అధికారులు ఎజెండాతో ముందుకు సాగితే గ్రామాల సమస్యలు సులభంగా పరిష్కరించవచ్చని, గ్రామ పంచాయతీలను తప్పనిసరిగా పర్యవేక్షించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజల అవసరాలను గుర్తించి సేవ చేయాలని, గ్రామ స్థాయిలో సుపరిపాలన అందిస్తున్నట్లు నిరూపించుకోవాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, అదనపు కలెక్టర్ వెంకటాచారి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, వ్యవసాయ అధికారి కవిత, ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, ఆర్డీఓ వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.



## హర్ దిల్ కీ ఫాంటసీతో షారుఖ్ ఖాన్‌ను కలిసిన 40 మంది విజేతలు

**ఖైరతాబాద్, జూలై 08 (జనం సాక్షి) :** ఐటీసీకి చెందిన సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ నిర్వహించిన 'హర్ దిల్ కీ ఫాంటసీ' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 40 మంది విజేతలు ముంబైలో నిర్వహిం చిన ప్రత్యేక ప్రైవేట్ పార్టీలో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌ను కలిసే అవకాశం పొందారని ఐటీసీ లిమిటెడ్ సన్‌ఫీస్ట్ మార్కెటింగ్ హెడ్ సూరజ్ కతూ రియా బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ '1 మిలియన్ ఫాంటసీస్' ప్రచార కార్యక్రమం ద్వారా 10 లక్షల మందికి పైగా వినియోగదారులకు బహుమతులు, ప్రత్యేక అనుభవాలు అందించగా, ఈ కార్యక్రమంలో విజేతలు షారుఖ్ ఖాన్‌తో ము చ్చటించి, ఫోటోలు దిగినట్లు చెప్పారు.ఈ ప్రచారం లో అమెరికా, యూరప్, థాయ్‌లాండ్ అంతర్జాతీ య పర్యటనలు, క్రూయిజర్ బైక్‌లు తదితర బహు మతులు కూడా అందించారని పేర్కొన్నారు. 2023 లో ప్రారంభమైన 'హర్ దిల్ కీ ఫాంటసీ' వేదిక ద్వా రా వినియోగదారుల ఆకాంక్షలను మరపురాని అనుభవాలుగా మలచడమే లక్ష్యమని తెలిపారు.

# కార్యకర్తకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ కార్యకర్త ఏదుల శంకర్‌కు ఘన నివాళులు
- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,రూ 5 లక్షల చెక్కు అందజేత
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వాకిటి శ్రీహరి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి జూలై 08 (జనంసాక్షి):**
కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,లు అన్నారు.తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఏదుల శంకర్ ఈనెల 4న మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ లో నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభలో అస్వస్థకు గురై ఏదుల శంకర్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు..ఇట్టి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సీఎం దృష్టికి తీసుకు వెళ్లడంతో..సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో బుధవారం రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ,5 లక్షల చెక్కును తల్లి అంజమ్మ,చెల్లెలు స్వప్న,కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.సీఎం దృష్టికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి,తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో సీతారామమ్మ,రాష్ట్ర పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక కళాకారిని శ్రీదేవి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి,నాయకులు ఆవంచ నరసింహారెడ్డి,కాకి కృష్ణ,డేవిడ్,రేణు రెడ్డి,గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, అజీజ్, ఆరిఫ్, రాజేందర్ నాయక్, మీసేవ మల్లేష్, శ్రీను, గణేష్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- జూలై 10న కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పిలుపు
- ప్రైవేట్ సంస్థల ఫీజు దోపిడీ అరికట్టాలి
- ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్
- ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు భర్తీ చేయాలి




**కాప్రా, జూలై 08 (జనంసాక్షి):** తెలంగాణలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలకు వ్యతిరేకంగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్యక్షుడు, కార్యదర్శి అజీమ్ పాషా, మహేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 10న వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపును అనుసరించి కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షుడు, కార్యదర్శి అజీమ్ పాషా, మహేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విలీనం, పాఠశాలల మూసివేత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ఎంఈఓ, డీఈఓ పోస్టుల భర్తీ లేకపోవడం వల్ల ప్రభుత్వ విద్య తీవ్ర సంక్షోభంలో పడిందని విమర్శించారు. పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ సంస్థల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థల్లో అధిక ఫీజు, డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజుల వసూలు అరికట్టాలని, 25 శాతం ఉచిత ప్రవేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఖాళీ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఈపీ-2020 అమలుకు ముందు విస్తృత చర్చలు నిర్వహించాలని కోరారు.జూలై 10న జరిగే కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు ఇర్ఫన్, సందీప్, సమీర్, రవి, అశోక్, కిరణ్ పాల్గొన్నారు.

# తాండూర్‌లో బుర్రకథ లక్ష్మికి దక్కని డబుల్ బెడ్‌రూమ్

- అర్హులను కన్నీళ్లు, అనర్హులకు ఇళ్ల కేటాయింపు
- డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో అక్రమాలు.. ప్రజా సంఘాల నిరసన



## కలుషిత తాగునీటి సమస్యను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, జూలై 8 (జనం సాక్షి) :** హయత్‌నగర్ పాత గ్రామం లోని కాస్‌బాగ్ ప్రాంతంలో కలుషిత తాగునీటి సరఫరాతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. జలమండలి అధికారులతో కలిసి బాధిత ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, స్థానిక ప్రజల నుంచి సమస్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత నీటి సరఫరా వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యకు గల కారణాలను గుర్తించి, దెబ్బతిన్న పైప్‌లైన్ మరమ్మత్తు పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా సురక్షితమైన తాగు నీటిని అందించడంతో పాటు, భవిష్యత్తులో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యపై వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మాజీ కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ పరిశీలనలో జలమండలి ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి



**హయత్ నగర్, జూలై 8 (జనం సాక్షి) :** వనస్థలిపురం డివిజన్‌లోని వెంకటరమణ కాలనీలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పనుల సమయంలో పెద్ద రాళ్లు ఎదురవుతున్నందున వాటిని తొలగించేందుకు కాంట్రాక్టర్ బ్లాస్టింగ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారని, దీంతో సమీపంలోని ఇళ్లకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత సిబ్బందితో మాట్లాడి, ఎట్టి పరిస్థితుల్లోనూ బ్లాస్టింగ్ చేపట్టవద్దని సూచించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో రాళ్లను తొలగించి పనులను కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్మాణ పనుల వల్ల నివాస గృహాలకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు, కాంట్రాక్టర్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, వెంకట రమణ కాలనీ అధ్యక్షుడు, రాజేష్, చారి, స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్‌లో ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

- రైతు భరోసా నిధులు విడుదలపై సీఎం రేవంత్, పీసీసీ చీఫ్‌కు పాలాభిషేకం



**తాండూరు జూలై 8(జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు తాండూర్ పట్టణంలోని రాజీవ్-ఇందిరమ్మ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతే వైఎస్ఆర్ లక్ష్యమని, ఆయన అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.
అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా రైతుల ఖాతాల్లోకి ఎకరాకు రూ. 6000 చొప్పున పంట పెట్టుబడి సహాయం జమ చేసిన సందర్భంగా నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తాండూర్ రైతుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని ఈ సందర్భంగా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధారసింగ్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింహులుతో పాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, పలువురు సీనియర్ నాయకులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాండూర్ లో బుర్రకథ లక్ష్మికి దక్కని డబుల్ బెడ్‌రూమ్

**తాండూరు జూలై 8(జనంసాక్షి) :** దశాబ్దాలుగా సొంత ఇంటి కల కోసం ఎదురుచూస్తున్న తాండూరుకు చెందిన బుర్రకథ లక్ష్మి వంటి నిరుపేదలకు అన్యాయం జరిగింది. తాండూరు మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో నిబంధనలను గాలికొదిలేసి, అనర్హులకు ఇళ్లు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజమైన అర్హులకు అన్యాయం.గత నెల జూన్ 27న తాండూరు మున్సిపాలిటీలో 581 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీని కోసం 8,333 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో సరైన విచారణ చేయకుండానే ఇళ్ల పంపిణీ జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితమే దరఖాస్తు చేసుకున్న బుర్రకథ లక్ష్మి వంటి ఎంతో మంది పేదలు, దరఖాస్తు చేసుకున్నప్పటికీ తుది జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ కేటాయింపు ప్రక్రియలో చోటుచేసుకున్న లోపాలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సొంత ఇళ్లు, ఆస్తులు ఉన్నవారితో పాటు, ఒకే కుటుంబానికి చెందిన పలువురికి ఇళ్లు మంజూరయ్యాయి.
స్థానికంగా ఉండేవారికే ప్రాధాన్యత ఇవ్వాలనే నిబంధనను పక్కనపెట్టి, అమెరికాలో స్థిరపడిన వారికి, హైదరాబాద్‌లో నివాసం ఉండేవారికి ఇళ్లు కేటాయించడం గమనార్హం.పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నామమాత్రంగానే విచారణ పూర్తి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ అక్రమాలపై తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ పేదల నోట్లో మట్టికొడితే సహించేది లేదు. అర్హులైన పేదలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి బాధ్యతతో వ్యవహరించి, తక్షణమే ఈ అక్రమాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిజమైన నిరుపేదలకు, అర్హులైన వారికి మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కే. చంద్రయ్య, నాయకులు గుమ్మడి రత్నం, తాండూర్ నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ సాధిఖ్, దివిటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

**బంట్వారం జూలై 8 జనంసాక్షి :** బంట్వారం తట్టేపల్లి నుంచి తురుమా మిడి మీదుగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల సమితి వికారాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఖదీర్పాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన విద్యార్థులు తురుమామిడి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

### మాజీ మండల అధ్యక్షులు నరసింహా రెడ్డి

**బంట్వారం జూలై 8 (జనంసాక్షి) :** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని సర్పంచ్ ల సంఘం మాజీ మండల అధ్యక్షులు నరసింహ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మంత్రి వర్గం పున వ్యవస్థీకరణ చర్చల్లో భాగంగా మంత్రి పదవి పోటీలో ఉన్న తమ నాయకులు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి దక్కుతుందని, కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విధేయుడిగా, శాసన సభాపతిగా పరిపాలనలో రాష్ట్ర ప్రజల మన్ననలు పొందిన గొప్పనేత అని తెలిపారు.
తమ నేత గడ్డం ప్రసాద్ కుమార్ గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని, మంత్రివర్గ విస్తరణలో భాగంగా తమ నాయకుడికి క్యాబినెట్ మినిస్టర్‌గా అవకాశం కల్పిస్తే, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షతో గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నారని, అధిష్ఠానం మంత్రి పదవి ఇచ్చే శాఖకు కర్తవ్యంతో బాధ్యతా యుతంగా పదవీ బాధ్యతలు నెరవేర్చడంలో ఆయనకు సాటి లేరని తెలిపారు.

## కోహెడలో రేపు ఎక్స్‌పోర్ట్ ఆధారిత ఫిష్ మార్కెట్ శంకుస్థాపన: హాజరుకానున్న మంత్రులు

**యాచారం, జూలై 8 (జనంసాక్షి) :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో జూలై 10వ తేదీన ప్రతిష్టాత్మక ఎక్స్‌పోర్ట్ ఆధారిత ఫిష్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ దూస వెంకటేష్ ముదిరాజ్ కూడా ఈ శంకుస్థాపనలో పాల్గొంటారని యాచారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నీలం శ్రీకాంత్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో యాచారం మండలంలోని ఫిషర్మెన్ సొసైటీ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు అందరూ విచ్చేసి ఈ శంకుస్థాపన సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## చౌదర్పల్లి లో కోళ్ల ఫారాల దుర్వాసన, ఈగల బెడదను నివారించాలి

### పంచాయితీ కార్యదర్శికి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేత

యాచారం, జూలై 8(జనం సాక్షి ) : యాచారం మండల పరిధిలోని చౌదర్పల్లి లో కోళ్ల ఫారాల నుంచి వచ్చే దుర్వాసన, ఈగల బెడద నుంచి ప్రజలను రక్షించాలని బిజెపి మండల నాయకుడు నడికుడి కృష్ణ గ్రామస్తులతో కలిసి పంచాయితీ సెక్రెటరీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కోళ్ల ఫారాలకు రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ అధికారి తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించాలని కోరారు.

# శారదానగర్‌లో డ్రైనేజీ సమస్యలపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ఉన్నతాధికారుల పర్యటన

**హయత్ నగర్, జూలై 8 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ఉన్నతాధికారులు బుధవారం కాలనీని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ప్రదీప్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ డైరెక్టర్ (ఆపరేషన్స్-1) వాసా సత్యనారాయణ, సీజీఎం నాగేంద్రకుమార్, జీఎం మహేందర్, డీజీఎం నాగరాజు, మేనేజర్ ప్రియాంకతో పాటు సంబంధిత అధికారులు హాజరయ్యారు.అనంతరం గడ్డిపోలాల ప్రాంతం, ట్రంక్‌లైన్ చివరి భాగం, కూలిపోయే ప్రమాదంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. ఫేజ్-1లో సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పునర్నిర్మించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అధికారులను కోరగా, వాటి పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డైరెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో పెద్ద పరిమాణంలో డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఫేజ్-3లోని రోడ్ నంబర్-30 వద్ద ట్రంక్‌లైన్ సమీపంలో కొత్త మ్యాన్‌హోల్ నిర్మాణంతో పాటు, ట్రంక్‌లైన్ చివర అసంపూర్తిగా ఉన్న పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని కాలనీ ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.



గత వారం రెండు విడతల్లో హైడ్రా సహకారంతో జేసీబీ ద్వారా డ్రెయిన్ కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించినట్లు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, గుమ్మా లక్ష్మి, రామకృష్ణ, సతీష్, యాదవరెడ్డి, మోహన్, రామ్‌కుమార్, వైశాలి, పద్మ, అన్నపూర్ణ, జగదీష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, విజయ్, చింటూ, చంద్రశేఖర్, మధు, డా. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10న తాండూర్‌లో విద్యాసంస్థల బంద్

- వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త బంద్‌కు బీసీ సంఘం సంపూర్ణ మద్దతు
- విద్యార్థుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సహించం
- బీసీ కార్యవర్గ సమావేశంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్



**తాండూరు జులై 8 (జనంసాక్షి) :** విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం, పెండింగ్‌లో ఉన్న విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం వామపక్ష పార్టీలు, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు బీసీ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ తెలిపారు. తాండూర్‌లో జరిగిన బీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌ల ఆలస్యం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు, పెరుగుతున్న విద్యా ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు.ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన, అందుబాటులో ఉన్న విద్యను అందించేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యతనిచ్చే విధానాలను పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నెల 10న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని, విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాలు, బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ షకుర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, వడ్డెర సంఘం జిల్లా నాయకులు వడ్డే సత్యనారాయణ, మహిళా నాయకులు అనిత, నరసమ్మ, మంజుల, జగదీశ్వరి, మంబాపూర్ మంజుల, మీడియా ఇన్‌చార్జ్ బసవరాజ్, తాండూర్ అధ్యక్షుడు బసంత్, యువ నాయకులు జోసఫ్, రాము ముదిరాజ్, పరమేష్, టైలర్ రమేష్, గోపాల్, నరసింహ, మంతటి రాజు, సురేష్, యాసర్, వినయ్, కిరణ్, శ్రవణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సీఎం డాక్టర్ వైయస్సార్ సేవలు చిరస్మరణీయం

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్
- ఘనంగా వైయస్సార్ జయంతి కార్యక్రమం

**బొంరాస్ పేట, జూలై 8 (జనం సాక్షి):** ఆంధ్ర ప్రదేశ్ మాజీ సీఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు. బుధవారం ఆయన జయంతిని పురస్కరించుకొని తుంకిమెట్ల గ్రామంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకము ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. విద్య, వ్యవసాయం తదితర రంగాలలో ఆయన ప్రవేశపెట్టిన పథకాలు పేద ప్రజలకు ఆపద్బాంధవుడిగా నిలిచారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, యువ నాయకులు సంతోష్ నాయక్, జనకంపల్లి సర్పంచ్ వెంకటయ్య, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజు గౌడ్, మోహన్ రెడ్డి, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి**

**నవాబుపేట్ జూలై 8 (జనం సాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలు తీర్చిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా నవాబుపేట్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి ఎనలేని సేవలు పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ, 108, ఇందిరమ్మ ఇండ్లు లాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన ఘనత అయనదని గుర్తు చేసుకున్నారు.ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా నవాబుపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సామ వెంకటరెడ్డి, బి బ్లాక్ అద్యక్షులు పోలీస్ మధుసూదన్ రెడ్డి, వికారాబాద్ కాంగ్రెస్ పార్టీజిల్లాప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, మండల ఉపాధ్యక్షుడు, మీనాపల్లి శివ ప్రసాద్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కర్ణం రఘు, కుమ్మరిగూడ ఉప సర్పంచ్ గోపాల కృష్ణ, అర్కతల సంగారెడ్డి,



శ్రీనివాస్, ఆధ్వర్యంలో నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో వారి చిత్రపటానికి పూల మాలతో ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా రైతు బాంధవుడు జనహృదయ నేత వైయస్సార్ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారాని కాంగ్రెస్ పార్టీ ని రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత దక్కిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైయస్సార్ ఆశయసాధన కోసం కృషి చేస్తున్నారని ప్రభుత్వం వారి స్పూర్తితో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీసర్పచ్ ప్రభాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు శివప్రసాద్, మండల యువజన సంఘము అధ్యక్షులు శేఖర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్ణం రఘు, ఉపసర్పంచ్ గోపాలకృష్ణ, సంగారెడ్డి, కావాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డా. వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

**నిజాంపేట్ జులై 8 జనం సాక్షి :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,ప్రగతినగర్ డివిజన్ (276) లో వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన 77వ జయంతి వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్



నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి దివంగత రాజశేఖర్ రెడ్డి తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసారు.పేద ప్రజలకు రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలకు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి),సీనియర్ నాయకులు పర్వతిని ఆంజనేయ వర్మ , మేడ శ్రీను ,భాస్కర్ రెడ్డి, ఎ వి రెడ్డి, వీరబాబు గౌడ్, డా. మద్ది నారాయణ రెడ్డి, బండ్ల విజయ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి,,బత్తుల చిరంజీవి,జెగ్గా మధుసూదన్ రెడ్డి,సయ్యద్ రఫత్, దాసరి మహేష్,,సురేందర్ యాదవ్,రవీందర్ రెడ్డి మరియు కాంగ్రెస్ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నవాబుపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**నవాబుపేట, జూలై 8 (జనం సాక్షి) :**
నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య లబ్ధిదారులకు చెక్కులుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్ రాథోడ్, నాయకులు నాగిరెడ్డి, బాలవంత్ రెడ్డి, నర్సింహా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కుమార్, మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాటిపర్తిలో సిసి రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నీలం రాము**

**యాచారం, జులై 8 (జనం సాక్షి) :**
యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామంలో నూతనంగా చేపడుతున్న సి.సి. రోడ్డు



నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నీలం రాము బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనులు జరుగుతున్నాయని, ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణాన్ని ముగించాలని అధికారులను, సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బైకని సాయిలు, నీలం సత్యనారాయణ, శ్రీశైలం, ఎండి ఇసాక్, పాండు పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో వైయస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో వైయస్సార్ 77వ జయంతి వేడుకలు

- స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజలకోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరువలేనివి
- వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పోకల్ కార్ హరినారాయణజి దూసరి బాలశివుడు గౌడ్



**ఇబ్రహీంపట్నం, జులై 8(జనం సాక్షి) :**
ఇబ్రహీంపట్నం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకల సందర్భంగా వైయస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కట్టపైన ఉన్న వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన వైయస్సార్ అభిమానులు వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పోకల్ కార్ హరి నారాయణజి దూసరి బాలశివుడుగౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ యువసేన నాయకుడు దూసరి వేణు ప్రసాద్ గౌడ్ ఈసందర్భంగా వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ స్వర్గీయ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో పేదప్రజల కోసం ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవే శపెట్టి భారత దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న గొప్ప నాయకుడు వైయస్ రాజ శేఖర రెడ్డి అని అన్నారు ముఖ్యంగా వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నపేదప్రజల కోసం ప్రైవే ట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకోవడానికి రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టాడు అలాగే పై చదువులు చదువుకోలేని స్థితిలో ఉన్నపేద విద్యార్థుల కోసం ఫీజు రియంబర్స్మెంట్ పథకం ప్రవేశ పెట్టాడు అత్యవసర వైద్య సేవల కోసం108 104 రైతుల కోసం ఉచితవిద్యుత్ పథకం రైతుల బకాయి రుణాలు మాఫీ లాంటి ఇంకాఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతిపేద కుటుంబానికి అమలు అయ్యేలా పాలన కొనసాగించి ఇప్పటికీ పేదప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచినగొప్ప ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి అని అన్నారు వైయస్సార్ పేద ప్రజలకు ప్రవేశపెట్టిన పథ కాలు సేవలు రాష్ట్ర ప్రజలు మరువలేనివి అన్నారు ప్రతి వైయస్సార్ అభిమాని వైయస్సార్ఆశ య సాధన కోసం పనిచేయాలి అని అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొర్ర మోతీరాంనాయక్ లోయపల్లి మాజీ సర్పంచ్ మిద్దె శ్రీనివాస్ గౌడ్ సత్యం తండా సర్పంచ్ నేనావత్ బాలునాయక్ మురళి మహమ్మద్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు

# వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి**



**శామీర్ పేట్, జూలై 08 (జనం సాక్షి) :** దేవరయాంజాల్‌లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.శామీర్‌పేట్ డివిజన్‌లోని దేవరయాంజాల్ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత ప్రజానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచారని అన్నారు.రాష్ట్ర అభివృద్ధితో పాటు సామాన్య ప్రజల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇచ్చిన అరుదైన నాయకుడిగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చరిత్రలో నిలిచిపో యారని తెలిపారు. ఆయన చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నా యని, ఆయన ఆశయాలను ముందుకు తీసు కెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, శ్రీ సీతారామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పేండం లక్ష్మీనారాయణ, మాజీ ధర్మకర్తలు ఎల్లెంకి భారతి, వలందాసు మురళి గౌడ్, గుడిసేని హరి కృష్ణ, తూంకుంట జగదీష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, కందాళ రాము, మిర్యాలకర్ సాయి కుమార్, కృష్ణా పాల్గొన్నారు.

# యాలాల్ మండలం రాస్నాంలో సర్ అవగాహన కార్యక్రమం

**ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**యాలాల జూలై 8 ( జనంసాక్షి ) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా యాలాల్ మండలం రాస్నాం గ్రామంలో నిర్వహించిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సందర్శించారు.బూత్ నెంబర్ 184, 185 ల వద్ద జరుగుతున్న సవరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారుల ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు స్వయంగా అందజేశారు. ఎవరూ పేరు నమోదు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారాలు నింపి సమర్పించాలని ఓటర్లకు సూచించారు.అనంతరం గ్రామంలోని రైతువేదికలో సర్ పై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఓటు ప్రతి పౌరుడి హక్కు అని, జాబితాలో పేరు సక్రమంగా ఉండటం ప్రజాస్వామ్యానికి బలం అని తెలిపారు. అధికారులు ఇంటింటికి వెళ్లి ఫారాలు సేకరిస్తున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్ కన్వీనర్ కరణము పురుషోత్తము రావు, పార్టీ మండల అధ్యక్షులు కుర్వ మైపాల్, స్థానిక సర్పంచ్ సురేశ్ మధు తో పాటు గ్రామ పెద్దలు, యువత మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.అధికారులు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

# బాబుల్‌రెడ్డినగర్ అభివృద్ధిపై కాంగ్రెస్ వ్యాఖ్యలు ఖండించిన ఉప్పల్ శ్రీను



**రాజేంద్రనగర్, జూలై 8 (జనంసాక్షి) :** బాబుల్‌రెడ్డినగర్‌లో జరిగిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకుడు సోమ శ్రీనివాస్ గుప్త చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని, మాజీ కార్పొరేటర్ ఎస్. వెంకటేష్ చేసిన సేవలను ప్రజలు మరచిపోలేరని బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్ బెల్లంపల్లి (ఉప్పల్ శ్రీను) అన్నారు. మాజీ కార్పొరేటర్ ఎస్. వెంకటేష్‌పై విమర్శలు చేసే నైతిక హక్కు సోమ శ్రీనివాస్ గుప్తకు లేదని ఆయన పేర్కొన్నారు. ఎస్. వెంకటేష్ కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో బాబుల్‌రెడ్డినగర్‌లో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్కూల్ భవనం, మహిళా భవనం, మోడల్ లైటింగ్ వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. అలాగే వివిధ ప్రముఖ నాయకులను బాబుల్‌రెడ్డినగర్‌కు తీసుకువచ్చిన ఘనత కూడా వెంకటేష్‌కేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని, నర్సాబాయ్ కుంట అభివృద్ధి పనులు, స్మశానవాటిక ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నా రని విమర్శించారు. విమర్శలు చేయడం కంటే రైల్వే గోడ తొలగించి రహదారి నిర్మాణం, ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయించడం వంటి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సోమ శ్రీనివాస్ గుప్తకు ఆయన సూచించారు.

# మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించిన కొలన్ హనుమంత రెడ్డి



**నిజాంపేట్ జూలై 8 జనం సాక్షి :** సిఎంసి పరిధిలోని సాయి నగర్ బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు రూ.45 లక్షలు మంజూరు చేయించి బుధవారం బాల బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న నిర్మాణ పనులను కుతుబుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ నివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


**- కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గోడుగు యాదయ్య**



**మొయినాబాద్, జూలై 08, జనంసాక్షి:** పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఆర్థికంగా ఎంతో దోహదపడ తాయని కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గోడుగు యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వారు పెద్ద ఎత్తున ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోడుగు యాదయ్య పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు బీపీ, షుగర్, రక్తహీనత, ఈసీజీ, ప్రసృతి వైద్య సేవలు, చిన్నపిల్లల చికిత్స, కదువు నొప్పి లాంటి పరీక్షలు, న్యూట్రిషన్, కంటి పరీక్షలు తదితర ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ యాదయ్య మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు రోగులకు ఎంతో ఆర్థికంగా మేలు కల్పిస్తాయన్నారు. ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన రావడం గ్రామ ప్రజలు, చుట్టు పక్కల ప్రజలు పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో అన్ని విధాలుగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినందుకు వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోటూరి అనితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తారాబాయి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

**ధారూర్ పీహెచ్‌సీ డాక్టర్ శాంతి**



**ధారూర్ జూలై 08(జనంసాక్షి) :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్ డి.డి) కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ ధారూర్ వైద్యాధికారి డా.శాంతి తెలిపారు. కార్యక్ర మంలో భాగంగా 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన పిల్లలు,యువతకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏవైనా కారణాల వల్ల మొదటి రోజు మాత్రలు తీసుకోలేని వారికి జూలై 20న మాప్-అప్ డే నిర్వహించి ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నట్లు వెల్లడించారు. పీహెచ్‌సీ ధారూర్ పరిధిలో మొత్తం 4,320 మంది లబ్ధిదారులు ఉన్నారని,వారిలో 2,137 మంది బాలురు,2,183 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేరకు ఆల్బెండజోల్ మాత్రలు పీహెచ్‌సీకి అందినట్లు డా. శాంతి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఫ్యూచర్ సిటీ అనుసంధాన రహదారి భూసేకరణకు మేడిపల్లి గ్రామస్తుల సమ్మతి

- **పరిహారంపై అంగీకారం తెలుపుతూ సమ్మతి పత్రాలు అందజేత**



**యాచారం,జూలై 8 (జనం సాక్షి) :** ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మించనున్న రహదారికి అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామస్తులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియ, పరిహారం చెల్లింపు, ప్రభుత్వ నిబంధనలు, రైతులకు కల్పించబడుతున్న ప్రయోజనాల పై గ్రామస్తులకు సమగ్రంగా వివరించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి.ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై గ్రామస్తులు అంగీకారం వ్యక్తం చేస్తూ తమ సమ్మతి పత్రాలను అదనపు కలెక్టర్‌కు అందజేశారు. భూసేకరణ ప్రక్రియను పరస్పర అవగాహనతో, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన గ్రామస్తులకు అదనపు కలెక్టర్ అభినందనలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, భూసేకరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు

## నిజాంపేట్, కూకట్‌పల్లి, చేవెళ్ల, ఘట్కేసర్‌లో పూలమాలలు, నివాళులు

- సంక్షేమ పథకాలు చిరస్మరణీయమన్న నాయకులు
- రైతు భరోసా నిధుల విడుదలకు రేవంత్‌కు కృతజ్ఞతలు
- ప్రజా సేవకుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**నిజాంపేట్, జూలై 8 జనం సాక్షి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, గాజుల సుజాత, బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. రాజీవ్ గృహకల్ప స్థానిక బీఆర్ఎస్ నాయకులు తోట బిక్షపతి, కేసీఆర్ వీరాభిమాన సంఘం అధ్యక్షుడు జలగం చంద్రయ్య, వి. శ్రీనివాసు, స్వర్ణకుమారి, పద్మ అంజి యాదవ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



### కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో వైఎస్ఆర్ జయంతి వేడుకలు

**కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు కరుమూరి వెంకట్ రెడ్డి, కొండ రాజీవ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కరుమూరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కొండ రాజీవ్ వైఎస్ఆర్ ఒక బ్రాండ్ అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రముఖులు కూడా నివాళులర్పించారు.

### చేవెళ్లలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**చేవెళ్ల:** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణంలోని షాబాద్ చౌరస్తాలో విగ్రహానికి ఎమ్మెల్యే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర వెంకట్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలు దేశానికి దిక్సూచిగా మారాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




### వైఎస్ సేవలు చిరస్మరణీయం.. కాంగ్రెస్ ఆణిముత్యం వైఎస్

**తలకొండపల్లి:** నాయకుడై ముందుకు నడిచి రాష్ట్ర ప్రగతిని తెచ్చిన, దేవుడై ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మహోన్నత నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. మండల కేంద్రం బస్టాండ్ వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకుని ఉచిత విద్యుత్, రుణమాఫీ, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు వంటి కార్యక్రమాలు అమలు చేసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారన్నారు. బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.




### మహేశ్వరంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి

**మహేశ్వరం:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండె చప్పుడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వైఎస్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్న గొప్ప నాయకుడన్నారు. కాకి ఈశ్వర్ ముదిరాజ్ సొంత ఖర్చుతో నూతన విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్పంచులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



### కైతలాపూర్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గం కైతలాపూర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు కలికోట శంకర్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొని కేక్ కట్ చేసి నివాళులర్పించారు. నిరుపేదలు, మున్సిపల్ పరిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఘట్కేసర్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**ఘట్కేసర్ :** ఘట్కేసర్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు భరోసా నిధుల విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటీకాల కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని తదితరులు పాల్గొన్నారు.







# కాలనీలో కరెంటు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎలక్ట్రికల్ ఏఈకి వినతి



**కాప్రా, జూలై 8 (జనం సాక్షి) :** కుషాయిగూడ డివిజన్ శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కాలనీలోని కరెంట్ సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో చర్లపల్లి ఏఈ బాలరాజును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు జయ సుధాకర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న కరెంట్ సింగిల్ పేజ్ నుండి త్రి పేజ్ కి మార్చి, జాయింట్ ఉన్న లైన్ లను తీసి కొత్తవి అమర్చాలని, కరెంట్ పోల్స్ లను మార్చాలని కోరుతూ కాలనీ అధ్యక్షులు జె సుధాకర్ చర్లపల్లి 2 ఎలక్ట్రికల్ ఏ ఈ బాలరాజు ను కోరారు. వెంటనే స్పందించిన ఏ ఈ బాలరాజు మాట్లాడుతూ కాలనీ లోని సమస్య ను పరిశీలించి నూతన వైరింగ్ లైన్లను, కరెంట్ పోల్స్‌లను మార్చేందుకు బడ్జెట్ వేసి, బడ్జెట్ శాంక్షన్ అయితే, త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ తమ కాలనీ లోని సమస్యలను పరిష్కరించు కొనేందుకు ఇలాగే కమిటీ సభ్యులు, కాలనీ వాసులు అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లి, కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం చేయడం జరుగుతుందని అన్నారు. కాలనీ సమస్యలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కరెంట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎలక్ట్రికల్ ఏఈతో మాట్లాడి మిగిలిన త్వరలో కరెంట్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యేకు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ జాయింట్ సెక్రటరీ మునీర్, ట్రెజరర్ ఏ శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఎస్ కృష్ణ, శివకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు నమోదు ప్రక్రియ చేసుకోవాలి



**నాచారం/జనంసాక్షి :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఓటు హక్కు సద్వినియోగం కార్యక్రమం లో భాగంగా. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలి అని కమిషనర్ నిత్యానంద తెలిపారు. బుధవారం రోజున నాచారం, హెచ్ ఎం టి నగర్ లో పర్యటించారు. అనంతరం నాచారం, హెచ్ఎంటి, నగర్లో నివాసముంటున్న ప్రజలు ప్రతి ఒక్కరు (ఎస్ఐఆర్) పత్రాలు తీసుకొని వాటిలో తమ వివరాలను పూర్తి చేయాలి అని నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద తెలిపారు. హెచ్ఎంటి నగర్‌లోని. ఇంద్ర నగర్,శాంతి గార్డెన్ లో పౌరులకు పలువురికి ఓటర్ నమోదు పత్రాలను అందచేశారు.అనంతరం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద మాట్లాడుతూ,,18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి అని అన్నారు. దీని వలన వివరాల ప్రకారం..ఒక వ్యక్తికి ఓటు హక్కు రెండు చోట్ల ఉంటే ఒకటి నిర్మూలించబడును అని అన్నారు. మరణించిన వారి పేర్లు సైతం తొలగిపోవును అని తెలిపారు.ఒక వ్యక్తి గతం లో ఉన్న చిరునామా లో లేకుండా వేరే చోట నివాసముంటే చిరునామా మార్పు చేసుకోవచ్చు అని అన్నారు. నకిలీ,తప్పుడు ఓటర్ కార్డులు ఉంటే కూడా తొలగించడం జరుగుతుంది, కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. (ఎస్ఐఆర్ ) విషయం పై, అధికారులు బూత్ లెవెల్ అధికారి మీ ఇంటికి ,మీ చిరునామాలో మీ వివరాలను సేకరిస్తారు. అట్టి ఫారం లో. నమోదు చేస్తారు. ఆ సమయం లో సిబ్బంది అడిగిన ప్రశ్నలు.. ఆధార్ లో ...మీ జనన సర్టిఫికెట్ లో ఉన్న సరైన చిరునామా. ఇంటి పేరుతో సహా పూర్తి పేరు వంటి వివరాల కోసం, పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు, ఇతర కార్డులు ఉంటే అందుబాటులో ఉంచుకోవాల అని నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద స్పష్టం చేశారు.ఈ ప్రక్రియ పూర్తి చేసినందుకు ఖచ్చితమైన ఓటర్ జాబితా సిద్ధమవుతుంది అని, నకిలీ ఓటర్ల సమస్య తీరుతుంది అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందడం కూడా జరుగుతుంది అన్నారు.ఎన్నికల విషయం లో ప్రజలకి .యువతకి అవగాహన పెరుగును అన్నారు.ప్రజల వద్ద సిబ్బంది వచ్చాక ,తమ ఓటు ఎక్కడ ఉంటుందో అని వారి ద్వారా తెలుసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలి అని నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద తెలిపారు.



## డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**మొయినాబాద్ జూలై08, జనంసాక్షి:** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉన్న వీజేటీ ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ఇన్స్పెక్టర్ గారు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొయినాబాద్ పోలీసు వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి, విద్య, క్రీడలు మరియు మంచి అలవాట్లపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.

## మాన్సింగ్‌ను పరామర్శించిన దావూద్

**ధారూర్,జూలై 08 (జనంసాక్షి) :** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మాన్సింగ్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ వార్డు సభ్యులు దావూద్ పరామర్శించారు.మాన్సింగ్ నివాసానికి వెళ్లిన దావూద్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, త్వరలో కోలుకొని పార్టీకి ప్రజలకు సేవ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పటేల్ అమరేశ్వర్.ఈరన్న సెట్. చెన్నారెడ్డి. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోవాలి

**మైనార్టీ నాయకులు ఎస్ఎం గౌసన్**

కొడంగల్, జూలై 8 (జనం సాక్షి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ నాయకుడు ఎస్.ఎం. గౌసన్ అన్నారు.బుధవారం కొడంగల్ పట్టణంలోని 244వ పోలింగ్ బూత్‌లో బీఎల్‌వో ఆనందమ్మ, బీఎల్ఏ సిరాజుద్దీన్‌తో కలిసి ఆయన ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చే బీఎల్‌వోలకు అవసరమైన వివరాలను స్పష్టంగా అందించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.బి. గుల్షన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు

**జమ చేసినందుకు సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు చిత్రపటాలకు పాలాభిషేకం**

**కొడంగల్, జూలై 8 (జనం సాక్షి):** రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ ఆధ్వర్యంలో కొడంగల్ పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ.8 వేల కోట్ల రైతు భరోసా నిధులను జమ చేయడం రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, వెంకట్రావు, నర్సింలు గౌడ్, శేఖర్, నయీమ్, సర్ కన్వీనర్ మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాలిండాపూర్‌లో భూముల రిసర్వేపై గ్రామసభ

**బొంరాస్ పేట,జూలై 8 (జనం సాక్షి):** బొంరాస్ పేట మండలం సాలిండాపూర్ గ్రామం యొక్క భూముల సర్వే నంబర్లకు సంబంధించి గురువారం ఉదయం 11 గంటలకు రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ పద్మావతి తెలిపారు.గ్రామ సభకు రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి,తాండూరు ఆర్డీవో అనిత,జిల్లా ల్యాండ్ సర్వే అధికారి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.రైతులు గ్రామసభకు హాజరు కావాలన్నారు.

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలి

- సిద్దాపూర్ ప్రజలతో కలిసి పోరాటానికి బిఎస్పీ సిద్ధం : బిఎస్పీ నేత దొడ్డి శ్రీనివాస్



**ఫరూఖ్ నగర్, జనంసాక్షి :** లంబడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబాల నాయక్ అధ్యక్షత నిర్వహించిన అఖిలపక్ష వివిధ పార్టీలతో పాటు బహుజన్ సమాజ్ పార్టీ తరపున ఆ సమావేశానికి షాద్నగర్ బిఎస్పి నేత రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ మరియు షాద్నగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు నీరడ్డి రాజు పాల్గొని ప్రసంగించారు, సందర్భంగా బిఎస్పీ నేత న్యాయవాది దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ను వెనక్కి తీసుకోవాలని షాద్నగర్ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరియు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి షాద్నగర్ చౌరస్తాలో పోరాడకుండా ప్రజలు ఓటు వేసి గెలిపించినందుకు వర్షాకాల సమావేశాల్లో శాసనసభల్లో శాసనమండలిలో పోరాటం చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యను కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల నేతల మాటల యుద్ధంగా చూడొద్దని,ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సమస్యగా దీన్ని అసలు చూడొద్దన్నారు , దీన్ని ప్రజా సమస్యగాపరిగణించి పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు. రాళ్లతో చంపుడు, ఇటుకలతో గుద్దడనే హింస పూరిత మాటలు వద్దని, దీనివల్ల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉందన్నారు, షాద్నగర్ ప్రాంతం మినీ ఇండియా అని దేశంలోని అన్ని రాష్ట్రాల వాళ్ళు అన్ని రకాల వసతులు ఇక్కడ ఉన్నాయి అన్నారు, సిద్దాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న సినీ హీరో ఇప్పుడు ఎక్కడున్నాడని నిలదీశారు.గ్రామంలో ప్రజలు ఆగమైతుంటే ఇప్పుడు ఎక్కడ దావుకున్నారని నిలదీశారు, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముందుండి అఖిలపక్షాన్ని ముఖ్యమంత్రి దగ్గరికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు.అఖిలపక్షంలో బీఎస్పీ తనవంతు పాత్ర పోషిస్తుందని సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమానికి బీఎస్పీ పార్టీ మద్దతు ఎప్పుడు ఉంటుందని అందుకు సిద్దాపూర్ గ్రామస్తులతో మరియు ఇతర కుల, ప్రజాసంఘాల నాయకులతో ఈ సమస్యపై కలిసి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కొంకల అయ్యప్ప ముదిరాజ్, ఆగిరాల రాజు, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.